


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కపడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**వాడి పేరు షగున్**. భోజపురీ బాగా వచ్చినవాడు. అయినా బిహారీకాదు. పుట్టకతో బిహారీ అయిన వాళ్ల యాస వేరు. భాష నేర్చుకుని బిహారీలుగా చలామణీ అయ్యేవాళ్ళ భాష వేరు. పితాజీ, నా లెక్క ప్రకారం అతడిది ఆఫ్ఘనిస్తాన్ అయుండాలి. ఒడ్డూ పొడుగూ శారీరక లక్షణాలూ ముఖ కవళికలూ అతన్ని బిహారీగా ఏనాడు గుర్తించనివ్వవు. చాలా కఠినమైన పరిశ్రమలో అతని బాల్యం గడిచి వుండాలి. అంతేగాదు,స్త్రీలంటే అంతులేని చులకన. మరో విషయం పితాజీ, అతని ముఖకవళికలూ నిటారుగా కూర్చునే పద్దతీ, చేతులు జాచి మోకాళ్ళ మీద పెట్టుకునే పద్దతీ అతను దేనికైనా, ఎంతకైనా తెగిస్తాడని, దేన్నీ లెక్క చెయ్యడనీ తెలుపుతుంది. సూటిగా వున్న ముక్కు, పలుచని చెవులూ అతను చాలా సూక్ష్మ గ్రాహి అనీ, ఒకసారి ఓ నిర్ణయం తీసుకుంటే, అతన్ని ఎవరూ మార్చలేరనీ కూడా అర్ధమవుతుంది." గులాబో పుండరీకాక్షుడితో అన్నది.

"శభాష్ తల్లీ. నిజంగా నువ్వు గనక ఇంటలిజన్స్ డిపార్ట్‌మెంట్‌లో వుంటే ఏ కేసయినా ఇట్టే పరిష్కారమవుతుంది. మనుషుల రూపాన్నేకాదు, వారు నిలబడే, కూర్చునే విధానాన్నీ, అవయవాల పొందికనీ ఇంత స్పష్టంగా పరిశీలించడం టాప్ కాప్‌లకి గానీ సాధ్యంకాదు. వాసుదేవ్‌తో చెప్పి ఆర్టిస్టులకు పంపిస్తాను. అతని బొమ్మ గనక 80 శాతం కరెక్టుగా

వేయించగలిగితే సమస్య చిటికలో పరిష్కారమవుతుంది." గులాబో భుజం తట్టి,తలమీద చేయి పెట్టి ఆశీర్వదించి అన్నాడు పుండరీకాక్షుడు.

"పితాజీ, మరొక్క విషయం, వాళ్ళ కదలికలూ, కవళికలూ చూస్తూంటే కేవలం మత కలహాలు సృష్టించడం కోసమే అనిపించడంలేదు. ఈ సృష్టి జనాల దారి మళ్ళించడానికి ఎవరితోనో చేయించి వుంటారు. షగున్‌ని చూస్తే ఇట్టాంటి చిల్లర పనులు చేసేవాడిలా కనిపించలేదు. అతన్ని పట్టుకున్నా నిజం చెప్పడు. ప్రాణం పోయినా చెప్పడు. అతన్ని పట్టుకుని, అతన్ని మనం గుర్తించమని తెలియచేయయడం కన్నా, అతన్ని నీడలా అనుసరించి 'అసలు' పని ఏమిటో తెలుసుకోవడం ఉత్తమం. అదీ అంత తేలికపని కాదు. అంతేకాదు, అతని గ్రూప్‌లోని వాళ్ళందరూ నిర్భయస్తులు. వాళ్ళ కళ్ళు కప్పి వాళ్ళని అనుసరించడం అంటే గొడ్డలితో తల గోక్కున్నట్టే" హెచ్చరించింది గులాబో.

పుండరీకాక్షుడు చాలాసేపు మాట్లాడలేదు. గులాబో చెప్పింది నూటికి నూరుపాళ్ళూ నిజమే. అతని చిత్రం, అంటే ఊహా చిత్రం గీయించి ప్రజలకి చూపించి ఎంక్వయిరీ చేస్తే, ఏమి లాభం వుండదు కదా, చెప్పలేని నష్టం జరుగుతుంది. ఒకవేళ షగున్‌కీ అతని గ్రూప్‌కీ యీ విషయం తెలిసిన మరుక్షణమే ప్లానూ, ప్లేసూ రెండూ మార్చేస్తారు.

దొంగ దొరకకుండా వుండాలంటే, పోలీసు ఆలోచనలకంటే వందరెట్లు ముందుండాలి. అలాంటిది ఓ టెర్రరిస్టో, 'ఇజమిస్టో' మరెంత అప్రమత్తంగా ఉండాలి. ఉంటారు గనకనే ప్రపంచంలో రోజు రోజుకీ హింసాకాండలు పెరుగుతున్నాయి. నిరంతరం అప్రమత్తంగా ఉండటం వాళ్ళ వృత్తి/ప్రవృత్తి. ఓ సుదీర్ఘమైన నిట్టూర్పు.

"నువ్వన్నదే నిజం తల్లీ. వాళ్ళ టార్గెట్ ఏంటో తెలియకుండా, కేవలం మత కల్లోలాల విషయంగా వాళ్ళని బయటపడేలా చెయ్యడం మూర్ఖత్వమే అవుతుంది. నువ్వన్నట్టే, వాళ్ళని అనుసరించడం కూడా అంత తేలికైన పనికాదు. పోలీసుల్ని కూడా వాళ్ళ వృత్తి లక్షణాల్ని బట్టి అంత తేలిగ్గా గుర్తించవచ్చు, దొంగలు పోలీసుల్ని గుర్తించడంలో మహా నిపుణులు. ఎప్పుడైతే పోలీసులు వెన్నాడుతున్నారని దొంగలకి తెలిసిందో, ఆ క్షణమే వాళ్ళు అండర్ కవర్‌కి వెళ్ళిపోతారు. వాసుదేవ్‌తో చర్చించి ఒక నిర్ణయానికి వస్తాను. ఆయుష్మతీభవ" అని ఆశీర్వదించి లేచారు పుండరీకాక్షుడు.

"అలాగే పితాజీ. ఇంకో చిన్న విషయం. బహుశా వాళ్ళెవరూ మళ్ళీ కలిసి ఇలా కనిపించరు. సాధువుల వేషాల్లో వచ్చినా వారు బాగా హిందీ ఉర్దూ అరబిక్ భోజపురీ తెలిసిన వారేగానీ హిందీ హిందీ బోలీలో కాదు. వారు మాట్లాడిన మాటల్లో డోగ్రీ పదాలు కూడా దొర్లినయ్. ఇక్కడకి వాళ్ళు విడివిడిగానే వచ్చి వుంటారు. ఏ గ్రూపూ కట్టుకలిసిగా పని చెయ్యదు. మీరన్నట్టుగా చిత్రకారుడ్ని పంపితే వీలున్నంత ఎక్కువ మందిని గుర్తుకు తెచ్చుకుంటానికి ప్రయత్నిస్తా. షగున్‌ని అయితే స్పష్టంగా చెప్పి మరీ చిత్రాన్ని గీయించగలను." మెల్లగా స్పష్టంగా అన్నది గులాబో.

"అలాగే తల్లీ. ఈ మొత్తం విషయాల్ని గుప్తంగానే, మన మధ్యనే వుంచుకుందాం. వాసుదేవ్‌కి అన్నీ వివరించి నిన్ను కలిసే ప్రయత్నం చెయ్యమని చెబుతాను. మరే విషయాలు జ్ఞాపకం వొచ్చినా సరాసరి ఇంటి కొచ్చెయ్. ఎందుకంటే,

వాసుదేవ్ కూడా చాలా వికలంగా ఉంటున్నాడు. ఏ చిన్న 'లీడ్ ' దొరికినా అదీ అద్భుతమే" మరోసారి దీవించి బయలుదేరాడు పుండరీకాక్షుడు. ఒక మాజీ పోలీస్ అధికారిగా అతనికి తెలుసు. సమస్య ఎంత క్లిష్టమైనదో. కానీ ఆ విషయం మంత్రులకీ, ప్రతిపక్షనాయకులకీ పట్టదుగా. ఇరవైనాలుగ్గంటల్లో అరెస్టులు జరిగిపోవాలని ఆర్డర్లు మీద ఆర్డర్లు వేస్తారు. జనాలూ అంతే. పోనీ పట్టుకుంటే? వాళ్ళని అర్జంటుగా వదిలి పెట్టాలని మౌఖిక ఉత్తర్వులు. పట్టుకోవడానికి లేని కుల మతాలు, విడుదల చెయ్యమని ఆగం చెయ్యడానికి మాత్రం అమోఘంగా పనికొస్తాయి. మత, కుల పెద్దలేకాక వోటు బేంకు రాజకీయం గ్రూపులు కట్టిన ప్రజానాయకులూ అప్పుడు కలుగుల్లోంచి బయటకొచ్చి ఉపన్యాసాలు దంచుతారు. దొంగకి కులం తోటీ, మతంతోటీ ఏం పని? ఈ విషయం మాత్రం ఎవ్వడూ ఆలోచించడు.

ప్రజల నాలికలు క్షణాల్లో మెలికలు తిరుగుతాయి. హత్యలు చేసిన వాళ్ళని నడిరోడ్డుమీద కాల్చెయ్యమని ప్రజలే అంటారు. ఏ పోలీసైనా అలా కాల్చిన వెంటనే, అది అన్యాయమనీ పోలీస్ ఎన్‌కౌంటరనీ అవే నాలికలు వేదాలు వల్లిస్తాయి. ప్రజాస్వామ్యం అనేది ఒక వ్యవస్త. నేరవ్యవస్థ వేరు. ఆ నేరస్తుల్ని పట్టిచ్చే పోలీస్ వ్యవస్థ వేరు. నేరస్తుల్ని శిక్షించే న్యాయ వ్యవస్థ  వేరు. కానీ యీ భేదాలని గమనించేదెవడూ? మరో నిట్టూర్పు పుండరీకాక్షుడి నాశికనించి వెలువడింది.

"గుప్త దృష్టి అనేది ఓ యోగ ప్రక్రియ. సుషుమ్నానాడిలాగా మారీచ నాడి అనేది ఓ నాడి. నాడి అనేకంటే కొన్ని నాడులు యీ మారీచ నాడి అధీనంలో ఉంటాయి. ఈ నాడిని సాధించగలిగితే, అంటే యీ నాడిని మేల్కొలిపి ప్రయోగించగలిగితే గుప్తనిధులు, గుప్త ఆలోచనలు స్పష్టంగా గోచరిస్తాయి. నిధుల సంగతి పక్కన పెడితే, గుప్తమైన ఆలోచనలని పట్టుకోగలగడమే ముఖ్యం. అమ్మా మహా కన్యా, నువ్వొక ప్రత్యేకమైన వ్యక్తివి. నీ పుట్టుకే ఓ విశిష్టమైనది. నీ తల్లీ, తండ్రీ, హితుడూ, బాంధవుడూ, గురువూ కూడా నీ సద్గురువే.

మారీచక నాడిని సాధించిన మహానుభావుల్లో  ఆయన ఒకడు. మరో చిత్రం ఏమంటే యీ నాడీ సాధనా రహస్యాన్ని ఒక గురువు ఒక్కసారే మరొకరికి బోధించగలరు. రెండో వారికి బోధించరాదు. అలా ఆ సిద్ది మీ గురువు అనగా నా గురువు నించి పొందిన దాన్ని నేను. నాకా రహస్యాన్ని ఎందుకు బోధించారో తెలుసునా? నాద్వారా నీకు ఆ యోగాన్ని బోధించాలని. ముందే చెప్పానుగా, నీదో విచిత్రమైన జాతకమని. నీది హస్తా నక్షత్రం. అది విఘ్నేశ్వరుని నక్షత్రం. ఆయనలాగే నీవు పుట్టిందీ చవితి. నీద్వారా లోకానికి జరగాల్సిన ఉపయోగాలు ఎన్నో వున్నై. ఈ గుప్త దృష్టి యోగం నీకు సిద్దించాక నీకు అనేకానేక సిద్దులు కరతలామలకమవుతాయి. నీ శక్తివల్ల కొన్ని ఆత్మశక్తుల్ని గుర్తించాలి. ఆత్మ శక్తులనగా ఆత్మశక్తిని అత్యధికంగా నిలుపుకుని మరలా జన్మించిన/జన్మించే వారిని గుర్తుంచాలన్న మాట. ప్రకృతికీ సంకల్ప వికల్పాలు ఉన్నాయి. ప్రకృతిలోనూ నెగటివ్. పాజిటివ్ అనే ధన, రుణ ధృవాలు ఉన్నై. ఆ రెండిటి సంగమంతోనేగా సృష్టి ఆవిర్భవించింది. అమ్మా 'అమావాస్య రానున్నది. అది పూర్ణం (సున్నా)లాంటిది. అందుకే మహా

మంత్ర వేత్తలు అమావాస్యనే యోగసాధనకైనా, మంత్రబోధకైనా వినియోగిస్తారు. నీరాక కూడా అందుకే నిర్ణయింపబడింది. ఈ ఉజ్జయినిలోనే నీకా గుప్తదృష్టి యోగాన్ని నేను నీకు బోధించాలి. నీకు పూర్తిగా వంట బట్టే వరకూ నీ తోడుగా ఉండాలి. విజయోస్తు సుదీర్ఘంగా ఉపన్యసించి మహా కన్యాదేవిని ఆశీర్వదించింది జటా వల్లభి.

"వారి కబురు మీ కెలా చేరింది తల్లీ" వినమ్రంగానే అనంది మహామాయ. "అవును కదూ" అన్నాడు హనుమంతు. చిన్నగా నవ్వింది జటావల్లభి. మీ ఫోన్‌లూ టెలిగ్రాములు ఇవన్నీ మాకు అక్కరలేదు మహామాయ. అత్యంత అధునాతనమైనవన్నీ పుట్టింది మనసులో నించే కదా! ఒకరి మనసులోంచి రాకెట్ పుడితే, మరొకరి మనసులో కంప్యూటర్ రూపు దిద్దుకుంది. ఒకరి మనసులో క్షిపణి పొడగడితే, వేరొకరి మనసులో ప్రపంచాన్ని జబ్బు నించి రక్షించే 'టీకా' పురుడుపోసుకుంది. మేము సంభాషించేది మనసుతో – మనసు సృష్టించే వస్తువులతో కాదు" అని హనుమంతు వంక చూసి, "ఏమోయ్.. ఈ ఉజ్జయిని నీకెలా కనబడుతోంది?" అనంది.

"ఎప్పుడో నేనిక్కడే జన్మించినట్టుగా ఉందమ్మా. అప్పుడీ భవనాలు తప్ప, ఉచిత ఆహారాన్ని ఇచ్చే ధర్మ శాలలు తప్ప ఎవరూ రాత్రిళ్ళు ఇక్కడ గడిపే వారుకారు. ప్రతిరాత్రీ ఓ అమ్మవారు నల్లని రూపుతో ఈ ఊరిని చుట్టి వస్తూండేది. చూడ్డానికి తాడి ప్రమాణం వున్నా ఆవిడ కళ్ళు చల్లని దయని వర్షించేవి. ఒక్కోసారి మాత్రం మహా రౌద్రంగా రంకెలు పెడుతున్నట్టుగా 'హూం'కారం చేసేది. అదేమిటో ఆవిడ్ని చూసి నేను పరుగు పరుగున ఎదురువెళ్ళేవాడిని. ఆ అమ్మ నా నుదుట విభూతి పెట్టేది. ఒక్కోసారి తనతో నన్ను కూడా నడవనిచ్చేది. ఒక్కోసారి ఆలయ శిఖరాన కూర్చోబెట్టి ఏదో మంత్రాక్షరాలు జరిపించమని చెప్పేది. అమ్మా ఇవన్నీ నా మనసున నిన్నో మొన్నో జరిగినట్టు అనిపిస్తోంది. కానీ, అప్పటి యీ నగరాన్నీ, ఇప్పటి ఉజ్జయినినీ చూస్తే మార్పు కొన్ని సంవత్సరాలలో కాదు, కొన్ని శతాబ్దాలు క్రిందటిది. ఈ నది తప్ప మరేదీ అదివరకుది కాదు. మహా శివలింగాలలోనూ ఏదో ఓ మార్పు గోచరిస్తోంది. అది ఏ మార్పో నాకు తెలియడం లేదు. ఒక మహా ప్రశాంతతని ఎవరో చెడగొడుతున్నారు. ఎవరో తెలీదు" ఓ ట్రాన్స్‌లో ఉన్నట్టు మాట్లాడాడు హనుమంతు. అతని కళ్ళు అర్ధనిమిలితాలయ్యాయి.

"అదృష్టవంతుడివి హనుమంతూ. ఒక్కొక్క కాలానికీ ఒక్కొక్కరు సాక్షిగా వుంటారు. ఒక అద్భుత అపూర్వకాలానికి నీ ఆత్మే సాక్షి. ఆ అమ్మవారు ఇప్పుడూ వుంది. ఇప్పుడూ యీ మహానగర రక్ష చేస్తూనే వుంది. ఇక మార్పులూ చేర్పులూ అంటావా ప్రకృతికి రుతువులు వున్నట్టే, జనావాసాలకి మార్పుచేర్పులుంటాయి. ఒకప్పుడు మహా సూర్యునిలా వెలిగిన నగరం, మరొకప్పుడు శిథిలమై దర్శనమిస్తుంది. ఒకప్పుడు అనామకంగా కొండ కోనల్లో కట్టిన గుడి, మరో సమయంలో కోటానుకోట్ల మంది నిత్యదర్శనం చేసుకునే మహాపుణ్యస్థలి అవుతుంది. మంచిది. ఈ అమ్మ నీ కన్నతల్లిలాంటిది. ఈ అమ్మ నీడలో వుండు. సరేనా? సకల శుభమస్తు" ఆశీర్వదించి లేచింది జటావల్లభి.

మెల్లగా తలాడించాడు హనుమంతు.

చీకటులు మెలమెల్లగా ఉజ్జయినిని ముసురుకుంటుంటే, నక్షత్రాల్లా మహా భవంతులలోని విద్యుద్దీపాలు వెలగసాగాయి. స్ట్రీట్ లైట్లు వేశారు. అమావాస్య రావడానికి మూడురోజులు ముందుగానే చీకట్లు ప్రబలమయ్యాయి. సన్నగా ఓ చిరుగాలి చుట్టచుట్టుకోవడం మొదలైంది. మెల్లగా ఆ చుట్ట చుట్టుకున్న చిరుగాలి అతి చిన్న అలలు రేపే సుడిగాలై మహాలయపు చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే గోపురంలోంచి గాలి వెలయించే ఓంకారం ఉధృతమైంది. గోపురమూ, ఆలయమూ అంతా ఓంకారంతో నిండిపోతోంది.

"సుడిగాలి ఓంకారాన్ని సృష్టించడం ఏమిటీ?" ఆశ్చర్యంగా అన్నది మహామాయ.

"శివుడు అంటే గతకాలపు దైవమో, భవిష్యదైవమో కాదు. శివుడంటే నిరంతరం సాగే వర్తమానం. భవిష్యకాలాన్ని తనలోకి లాక్కుని గతంలోకి నెడతాడు. భూతకాలాన్ని తనలో ఇముడ్చుకుని భవిష్యత్తులో సంచరిస్తాడు. అందుకే శివుడు నిరంతర వర్తమానానికి సాక్షి. ఆ వర్తమానమే భూత భవిష్య కాలాలకి మూలం. ఇంకా చెప్పాలంటే కాలమే శివుడు. అందుకే ఆ కాల స్వరూపుడికి తెలియనిదంటూ ఏదీ లేదు. ఆ త్రికాలాల్లోనూ కరిగేది జరగబోయేది తెలిసినవాడు ఆ ఫాలాక్షుడొక్కడే... అది ఆ మహాశివుని నాశికలోంచి పుట్టిన ఓంకార ధ్వని. ఆస్వాదించు." ఆనందంగా కన్నులు మూసుకుంటూ అన్నది జటా వల్లభ.

**తిరుపతి**

సుదర్శన్, జయ్, రాబీ, శాస్త్రిగారూ, మదాలస, యజ్ఞప్ప అందరూ తిరుపతి వచ్చారు. మొట్టమొదట చేసింది రాబీని Dr.TVN (తిరువీధి నారాయణాచార్యులు)గారికి చూపించడం.

"శాస్త్రిగారూ, యీయన ఆరోగ్యం పెర్ఫెక్ట్‌గా వుంది. ఇతని మనసూ ఇతనితోనే వుంది. అయితే, అప్పుడు శరీరం బాగున్నా మనసు మరోశక్తి ఆధీనంలోకి పోయింది. ఆ శక్తి ఎంతటిదో నాకు తెలీదుగానీ, ఎప్పుడైనా ఇతని మనసు ఆ శక్తికి వశమూ కావొచ్చు – కాకపోనూ వచ్చు" అన్నారు Dr.TVN, రాబీ ఎదటే.

"మీరు డాక్టర్ కదూ. శక్తులూ ఆత్మలూ అనే సందేహాస్పద విషయాలగురించి పేషెంట్‌తో చెప్పవచ్చునా?" అడిగాడు యజ్ఞప్ప.

"మంచి ప్రశ్న వేశారు సోదరా, .. సోదరా అన్నందుకు వేరేగా భావించకండి. మీదీ నాదీ దాదాపు ఒకటే వయసు గనక అన్నాను.

'శక్తి' సందేహాస్పదం ఎందుకవుతుందీ? శక్తి లేని సృష్టి అసలు మనగలదా? పంచభూతాలూ శక్తిమయాలేగా. పంచభూతాలకి అతీతమైనది సృష్టిలో గోచరించగలదా? సర్వమూ శక్తిమయమే. ఇక ఆత్మ సంగతి. బల్బు వెలగటం చూడగలం. కరెంటు వున్నదని నిర్ధారించగలం. కానీ కరెంటుని చూడగలమా? దాని రంగు, రుచి, గుణం, స్వభావం

వివరించగలమా, సృష్టిలో సర్వమూ శక్తి స్వరూపాలే. మనకి కనిపించేవి అన్నీ, అంతా.. పదార్ధ రూపంలో వున్న శక్తే" ఆగారు Dr.TVN.

"చక్కని విశ్లేషణ అన్నది మదాలస.

"థాంక్యూ యంగ్ లేడీ, ఇక పేషెంటు సంగతి చెబితే, అతని ముందు దాయాల్సింది ఏమీలేదు. ఈ స్థితిలో, ప్రస్తుతం అతనికి తెలుగురాదు. కనుక భయంలేదు" పకపకా నవ్వాడు డాక్టర్ టి.వి.ఎన్.

"అవును కదూ.. మర్చేపోయా" తనూ నవ్వాడు యజ్ఞప్ప.

"వాటీజ్ గోయింగ్ ఆన్" అయోమయంగా అన్నాడు రాబీ.

"నథింగ్.. మీ హెల్త్ గురించి డిస్కషన్. ఆల్ యీజ్ వెల్ అంటున్నారు డాక్టర్" చెప్పాడు జయ్.

"Oh... సరే. గుడిమల్లం ఎప్పుడు వెళ్దాం?" అడిగాడు రాబీ.

"గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాక డిసైడ్ చేద్దాం" చెప్పాడు జై.

"ఓకె ఓకె" అన్నాడు రాబీ, బయటికి నడుస్తూ.

"గుడి మల్లం ఏమిటీ, ఆ శివాలయం గురించి ఇతనికి ఎవరు చెప్పారూ?" కుతూహలంగా అన్నాడు Dr.TVN.

"అతనే ఓ ట్రాన్స్‌నించి బయట పడ్డాక అన్నాడు. అక్కడ కొన్ని పూజలు చేయాలని స్వప్న అదేశమట" వివరించారు శాస్త్రిగారు. సమావేశం ముగిసింది.

"**SO**, శాస్త్రిగారూ.. గుడిమల్లం గుడిపూజలూ వీటికి ఎవరెవరు వుండాలీ?" అడిగాడు సుదర్శన్. తల పరికించారు శాస్త్రిగారు.

"నిజం చెబితే అది అక్కడికి వెళ్ళాకే తెలుస్తుందనుకుంటా, ఏ పూజ చేయాలో. అలా తెలియక పోయినప్పుడు అభిషేకం చేయిద్దాం. ఇక ఎవరెవరూ అంటే చెప్పలేను. సుదర్శన్ నీవూ, జయ్ చాలా రోజులుగా పనులు మానుకుని మాతోనే వున్నారు. యజ్ఞప్పగారూ మదాలసా వచ్చింది ఇప్పుడే గనక, తిరుపతీ, తిరుమలా, శ్రీనివాస మంగాపురం, అలమేలు మంగాపురం, గంగమ్మ గుడీ, రాములవారి గుడీ, గోవిందరాజస్వామి వారి గుడీ, కాణిపాకం, శ్రీ కాళహస్తి ఇవన్నీ తీరిగ్గా చూస్తారు. దానికి కనీసం ఓ వారం పడుతుందికదా! కనక నేనూ యజ్ఞప్ప మదాలస ఇక్కడ రాబీతో ఉంటాం. మీరిద్దరూ మీ పనుల మీద సాగిపోవచ్చు" పరిస్థితిని సమీక్షించి అన్నాడు శాస్త్రిగారు.

"ఏం లేకపోయినా మేనేజ్ చెయ్యగలరా? శ్రీనివాస్ ఉంటే మాకు ధైర్యం వుండేది. మీరూ యజ్ఞప్పగారు వయసులో పెద్దవారు. ప్రతీ చిన్నా చితకా పనికీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టకూడదు. ఇక మదాలస ఆడపిల్ల." అన్నాడు జయ్ సాలోచనగా.

"మరేం పరవాలేదు. ఏ పనినైనా నేను చెయ్యగలననే నమ్మకం నాకుంది. ఆడపిల్లనేకానీ, అబలని కాదు" నవ్వి అన్నది మదాలస.

"ఆ విషయం ముమ్మాటికీ నిజం జయ్. మా తల్లి సాక్షాత్తూ మంగళా దేవే" మురిపెంగా అన్నారు యజ్ఞప్ప.

సుదర్శన్ అందరివంకా చూశాడు. శాస్త్రిగారివైపు తిరిగి

"అయ్యా.. ఇన్నాళ్ళూ మీతోనే వున్నాను. కానీ మా పూర్వీకుల చరిత్రని మీద్వారా తెలుసుకునే అవకాశం కలగలేదు. అసలా విషయాన్ని నేనెలా మరిచిపోయానో నేనే వూహించలేను" అన్నాడు.

"నాయనా, కాలం ఎప్పుడూ నిగూఢంగానే వుంటుంది. సమయం వచ్చినప్పుడు మాత్రమే కొన్ని విషయాలు బయటపడతాయి. పడలేదూ అంటే అర్ధం ఆ విషయం తెలుసుకోగల సమయం ఇంకా రాలేదని. చూద్దాం.. భవిష్యత్తు ఆ అవకాశం మనకి ఇస్తుందేమో?" అన్నారు శాస్త్రిగారు.

"అవునూ అసలు శ్రీనివాస్ సంగతేమిటీ?" కుతూహలంగా అన్నారు యజ్ఞప్ప.

"ఏమో? అతనికీ విలియమ్స్ కీ తెలియాలి" నిర్లిప్తంగా అన్నాడు జయ్. అతని మాటల్లో నైరాశ్యం.

"అంత నైరాశ్యం ఎందుకూ?" అడిగింది మదాలస.

"రాబీకి హెల్ప్ చెయ్యమని శ్రీనివాస్‌కి చెప్పిందే నేను. నామాట వల్ల అతను ఇందులో దిగాడు. అసలు మనిషే పత్తాలేకపోతే మరి నిరాశా నిస్పృహలు తప్ప ఏముంటై. పనులు లక్షా తొంభై పెండింగులో ఉన్నై. కానీ మనసు, శ్రీనివాస్ క్షేమం తెలిసేదాకా ఇక్కడినించి కదలనంటోంది" వేదనగా అన్నాడు జయ్. అందరూ మౌనాన్ని ఆశ్రయించారు.

అమావాస్య. చిమ్మచీకటి. వెలుగు అందం వెలుగుదైతే చీకటి అందం చీకటిదే. అమవాస్య రాత్రిలోనే చూడగలం నక్షత్రాల అందాల్ని. అమావాస్య రాత్రుల్లోనే చూడగలం మిణుగురు పురుగుల తళుకు బెళుకుల్ని. అమావాస్య రాత్రుల్లోనే చూడాలి నిశ్శబ్దంగా, భయంకరంగా, మహోత్సాహంగా, మహోన్నతంగా ఎగసిపడే సముద్ర కెరటాలని. వెలుగులో చీకటి లేదేమో కానీ చీకటిలో ఓ వెలుగు వుంది. మొదట కంటికి ఏమీ కనపడకపోవచ్చు. జాగ్రత్తగా కనులు విప్పి చూస్తూనే వుంటే, పరిసరాలు కనిపిస్తాయి. ఆ స్పష్టత కంటికంటే ఎక్కువగా మనసుకి తెలుస్తుంది. సిప్రా నది (క్షిప్రా) ఉరకలెత్తుతోంది ఏదో ఓ మహాశక్తి ఒడిలో ఓ పసిపిల్లవాడు హాయిగా ఆడుకుంటూన్నట్టు.

పగటిపూట గాలిలో తెలియని సుగంధం, ఆ చిమ్మ చీకటి వేళ గాలిలో ఉధృతంగా ప్రవహిస్తూ నాశికలనే గుహ మండపాలని చేరి, గుండెల్లోకి దూరి, మనసుని మత్తెక్కిస్తోంది. అదీ ఎటువంటి గాలి? తరగలు తరగలుగా వీస్తున్న గాలి. ఓంకారాన్ని వినిపిస్తున్న గాలి. ఓ మహాద్భుత దృశ్యానికి ఆ చీకటి, ఆ గాలి సాక్షులుగా మారాయి.. మహాద్భుత దృశ్యం,

అర్ధరాత్రి ఆ నదీ తీరాన జటావల్లభి మహా కన్యాదేవికి మారీచనాడీ మంత్రాన్ని బోధించడం. మారీచ నాడిని సాధించే 'సాధన 'నివ్వడం..

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments